క్లుప్తంగా

ఐటీఐ కళాశాలలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్



నియామక పత్రాలు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

సంగం : సంగం మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను గురువారం నిర్వహించారు. ఇందులో మొత్తం ఐదు కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. వివిధ కళాశాలల నుంచి వంద మంది విద్యార్థులు హాజరు కాగా, 70 మంది అర్హత సాధించారు. ఈ మేరకు వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు ఐటీఐ కళాశాలల ప్రిన్సిపల్స్ కె.ఏడుకొండలు, కె.శ్రీధర్, షేక్.గౌస్‌బాషా, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



మర్రిపాడు : మండల పరిధిలోని సింగనపల్లి, ఎస్సీ కాలనీ, సింగనపల్లి ఉర్దూ, టీఎస్‌పేట, ఏపిలగుంట మెయిన్ ప్రాథమిక పాఠశాలల్లోని దాదాపు వంద మందికిపైగా విద్యార్థులకు తెల్లపాడు గ్రామానికి చెందిన ఎన్నారై గంగవరపు నారపరెడ్డి నోటు పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 ధనలక్ష్మి దాతను అభినందించారు. కార్యక్రమంలో మండల రిసోర్స్‌పర్సన్ రాజేంద్ర కుమార్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రామసుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, తిరుపతమ్మ, సాబిహా, ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, వీరభద్రకుమారి పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నేడు

ఆత్మకూరు : ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకులు గురువారం తెలిపారు. యూనియన్ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా ఎల్ఐసీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 నుంచి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన



డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కావలి : పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యమని విశ్రాంత హెచ్‌ఎం సి.శారద అన్నారు. విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి జయంతిని విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో అసిస్టెంట్ హెచ్‌ఎం జి.కల్యాణి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వోదయ – జవహర్ భారతిలో చదువుకున్న విద్యార్థులు గొప్పస్థాయిలో స్థిరపడినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరి, శ్రీనివాసులురెడ్డి, శివకుమార్‌రెడ్డి, షరీఫ్ పాల్గొన్నారు.

విద్యాప్రదాత డీఆర్



అడవిరాజుపాలెం యూపీ పాఠశాలలో..

పట్టణంలోని అడవిరాజుపాళెంలో ఉన్న యూపీ పాఠశాలలో విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, విద్యాప్రదాత డాక్టర్ డీఆర్ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కావలి ఎంఈఓలు గోవిందయ్య, వెంకట సుబ్బయ్య మాట్లాడారు. డీఆర్ సేవలను కొనియాడారు. గ్రామస్తులు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

దుస్తుల పంపిణీ

జవహర్ భారతి డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం ఆధ్వర్యంలో డీఆర్ జయంతిని గురువారం నిర్వహించారు. కళాశాల ఉద్యానవనంలో దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ డీఆర్ తన జీవితంలో పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తుచేశారు. అనంతరం కళాశాల సిబ్బందికి దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.సుబ్రహ్మణ్యంనాయుడు, ట్రెజరర్ విశాలాక్షి, సెక్రటరీ వెంకటరావు పాల్గొన్నారు.

విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు



సోమశిల : అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కావలి : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్వాతంత్య్ర పోరాటంలో ప్రజల్లో విప్లవజ్యోతి వెలిగించారని లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి అన్నారు. కావలి పట్టణంలోని ముసునూరులో ఉన్న ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలకొండారెడ్డి మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం పోరాడుతూ బ్రిటీష్ పాలకుల తుపాకీ గుండ్లకు అమరులయ్యారని గుర్తుచేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ సుజాత మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు పీడిత ప్రజల పక్షాన పోరాడినట్లు తెలిపారు. విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణతో ఉన్నత విద్యను అభ్యసించి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో..

ఉదయగిరి : పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామరాజు చిత్రపటానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారత స్వాతంత్య్ర సంగ్రామంలో తెలుగుజాతి పౌరుషాన్ని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. అల్లూరి చరిత్రను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ జి.రమేష్, ప్రొఫెసర్లు సునీత, గోపీకృష్ణ, పాల్, కిషన్, నారాయణస్వామి, బాలచందర్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఉదయగిరి : వ్యవసాయ కళాశాలలో..

చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

సోమశిల : అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని హెచ్‌ఎం సురేష్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బ్రిటీషర్ల గుండెల్లోకి దూసుకుపోయిన విప్లవ బాణం అల్లూరి సీతారామరాజు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, మదీనా, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాధవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు జూనియర్ కళాశాలలో..



కావలి : గురుకుల పాఠశాలలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

• అనంతసాగరం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు.

స్థానిక జూనియర్ కళాశాలలో..

ఆత్మకూరు : స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ కె.వాణి విద్యార్థులకు సీతారామరాజు చరిత్రను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.లక్ష్మణరెడ్డి, పి.శ్రీహరి, షేక్.అహమ్మద్ మొహిద్దీన్, డి.వేణుగోపాల్ రెడ్డి, వై.మెస్సీ, జాన్ సుధీర్, శిరీషా, నిర్మల, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలను వెంటనే చెల్లించాలి



మురగళ్లలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

ఆత్మకూరురూరల్ : మండలంలోని మురగళ్లలో ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసిన కూలీలకు రెండు నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గంటా లక్ష్మీపతి కోరారు. మురగళ్లలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం వారు పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు రెండు నెలలుగా చేసిన పనికి నగదు ఇవ్వడం లేదని కూలీలు ఈ సందర్భంగా వారికి తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బకాయిలు చెల్లించాలని చేశారు. కార్యక్రమంలో వారి వెంట వెంకటేశ్వర్లు, పెంచలయ్య, తోడేటి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధికి సహకరించండి



కేంద్ర బృందం సభ్యులకు సమస్యను వివరిస్తున్న స్థానిక రైతులు

వింజమూరు(ఉదయగిరి) : గ్రామకొలను పథకం ద్వారా చాకలికొండ చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పిల్లాపేరు నుంచి సజావుగా నీరు వచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కేంద్ర బృంద సభ్యులకు విన్నవించారు. వింజమూరు మండలం చాకలికొండలో కేంద్ర జలశక్తి అభియాన్ బృందం సచిద్రకుమార్ పట్నాయక్, లక్ష్మీనారాయణ, లోకేశ్ గురువారం పర్యటించారు. గ్రామకొలను పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు వారితో మాట్లాడారు. పిల్లాపేరు వద్ద ఏర్పాటు చేసిన ఆనకట్టను అభివృద్ధి చేసి కాలువకు మరమ్మతులు చేపడితే వర్షాకాలంలో చెరువుకు నీరు సమృద్ధిగా అందుతాయని వివరించారు. మరో రూ.5 కోట్ల నిధులు మంజూరు చేస్తే 1500 ఎకరాలు నీటిపారుదలతో పాటు 8 గ్రామాల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. దీనికి కేంద్ర బృంద సభ్యులు స్పందిస్తూ అవసరమైన ప్రతిపాదనలు తయారుచేసి పంపాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ రమణరావు, ఏఈ రమేష్, స్థానిక ఎంపీటీసీ వంశీ, రైతులు గడ్డం రమణారెడ్డి, చెంచిరెడ్డి, దిండు వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులు ఆపాలని ఆందోళన



ఆందోళన తెలుపుతున్న రైతులు

సీతారామపురం : జాతీయ రహదారి 167–బీ పనుల్లో భాగంగా సీతారామపురం గ్రామ సమీపాన నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు ఆపాలని కోరుతూ సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి ఆధ్వర్యంలో పలువురు రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. పంట పొలాలకు ఆనుకునే పలు చెరువుల అలుగు నీరు, వాగునీరు ప్రవహిస్తోందని, ఆ ప్రాంతంలో ప్రస్తుతం నిర్మిస్తున్న బ్రిడ్జి పరిమాణం చిన్నదిగా ఉందని రైతులు తెలిపారు. అంతేకాకుండా కాలువ దిశ కాకుండా పంటపొలాల్లోకి నీరు ప్రవహించేలా బ్రిడ్జి నిర్మాణం తయారవుతుండటంతో వర్షాకాలంలో తమ పొలాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. కాంట్రాక్టర్ మాత్రం ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తామని చెబుతున్నా, ప్రయోజనం చేకూరదని వారు వాపోతున్నారు. అధికార యంత్రాంగం స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనుల్లో సమూల మార్పులు చేసి తమ పంట పొలాలకు నీటి ప్రవాహం నుంచి రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వంగవీటి రంగాకు నివాళి



అల్లూరు : రంగా చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అభిమానులు



సంగం బస్టాండ్ సెంటర్‌లో..

అల్లూరు : స్థానిక బలిజపాళెం కాలనీలో వంగవీటి మోహనరంగా జయంతిని ఆయన అభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున కేక్ కట్ చేసి ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం నివాళి అర్పించారు. కార్యక్రమంలో రంగా అభిమానులు చెన్నకేశవ, సాయి, సాయిభార్గవ్, జితేష్, సుమంత్, శివ, కిరణ్, కల్యాణ్, అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

• **సంగం :** స్థానిక బస్టాండ్ సెంటర్‌లో దివంగత వంగవీటి మోహనరంగ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరంగా చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

• **కావలి :** కావలి పట్టణంలో దివంగత వంగవీటి మోహనరంగా జయంతిని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని, రంగా చిత్రపటానికి నివాళులర్పించారు. పట్టణంలోని ట్రంక్‌రోడ్డులో రంగా విగ్రహం వద్ద కాపు నాయకులు నివాళి అర్పించారు.

ఏఐఐఈఏ ఆవిర్భావ దినోత్సవం



రోగులకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ

ఆత్మకూరు : ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐఐఈఏ) 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. ఎల్ఐసీ బీఎం మొహర్‌కుమార్ మాట్లాడుతూ తమ యూనియన్ ద్వారా ఏటా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్‌ఎం డాక్టర్ ఉషాసుందరి, ఎల్ఐసీ యూనియన్ నాయకులు శివకుమార్, శ్యామ్ ప్రభాకర్, ప్రవీణ్, డి.రమేష్, రమాదేవి, శీనయ్య, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్ పరిశీలన



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

సంగం : సంగం పీహెచ్‌సీ పరిధిలోని వెంగారెడ్డిపాళెం, పడమటిపాళెం గ్రామాల్లో జరుగుతున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను స్టేట్ మానిటరింగ్ అధికారి కె.దేవగణేష్, జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ గురువారం పరిశీలించారు. వ్యాక్సిన్ క్యారియర్ కోల్డ్ స్టోరేజీ కిట్‌ను తనిఖీ చేశారు. వ్యాక్సిన్ వేసుకున్న వారి గురించి ఆరాతీశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జలీల్ అహ్మద్, ఎస్టీఎస్ సురేష్, ఎంఎల్‌హెచ్‌పీ ప్రత్యూష, హెచ్‌ఏ ప్రసాద్, ఏఎన్‌ఎం రాజమ్మ, ఆశా వలంటీర్ పాల్గొన్నారు.

వెంగమాంబ సన్నిధిలో భక్తుల కోలాహలం



అమ్మవారికి కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

దుత్తలూరు : మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు సన్నిధిలో గురువారం భక్తుల కోలాహలం నెలకొంది. బ్రహ్మోత్సవాలు ముగిసినా భక్తుల రాక కొనసాగుతోంది. ఈ సందర్భంగా వెంగమాంబ–గురవయ్య విగ్రహాలను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొబ్బరికాయలు కొట్టి కోరిన కోర్కెలు తీర్చాలని వేడుకున్నారు. అలాగే అమ్మవారి నగదును తమ వ్యాపారాల్లో పెట్టుబడి కొరకు తీసుకున్నారు.

సాయుధ నిధికి విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

ఉదయగిరి : సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళాలు అందించాలని ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు కోరారు. మండల కేంద్రంలోని పలు పాఠశాలలకు ఆయన గురువారం విరాళాల సేకరణకు హుండీలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ సైనికులు, సైనికుల కుటుంబాల సహాయార్థం విద్యార్థులు, ఉపాధ్యాయులు విరాళాలు ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో సేకరించిన విరాళాల నగదును జిల్లా కేంద్రానికి పంపుతామన్నారు. అనంతరం ఆయన దళితవాడ ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యవసర పనులకు ప్రతిపాదనలు



ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి

ఉదయగిరి : ఉదయగిరి జలవనరుల శాఖ సబ్‌డివిజన్ పరిధిలో గండిపాళెం జలాశయం, చెరువుల అత్యవసర మరమ్మతుల కోసం రూ.43 లక్షలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి తెలిపారు. స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తొమ్మిది పనుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే గండిపాళెం జలాశయం కాలువల్లో పూడికతీత, వివిధ చెరువుల మరమ్మతులు చేపడుతామని చెప్పారు. అలాగే చెరువుల్లో అనుమతుల్లేకుండా మట్టి తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



నేలపాలైన పాలు, గాయపడిన విజయ్

మర్రిపాడు : మండలంలోని డీసీపల్లి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. అప్పారావుపాళేనికి చెందిన నాగమణి అనే ఆటో డ్రైవర్ నందవరం నుంచి పాల లోడుతో ఆత్మకూరుకు వస్తున్నారు. డీసీపల్లి సమీపానికి వచ్చేసరికి స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ఎం.విజయ్ రోడ్డు దాటుతుండగా అతన్ని ఢీకొట్టారు. దీంతో ఆటో బోల్తా పడింది. ఆటోలోని పాలు నేలపాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో విజయ్‌ను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. నాగమణికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూగర్భ జలాల పెంపే ధ్యేయం



కలిగిరి: నిమ్మతోటలను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

కలిగిరి : వర్షపునీరు వృథాగా పోకుండా నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచడమే జల్‌జీవన్ మిషన్ ధ్యేయమని కేంద్ర జల్‌శక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ సచిద్రకుమార్ పట్నాయక్ తెలిపారు. మండలంలోని కలిగిరి, సిద్దనకొండూరు, నాగసముద్రం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. తొలుత సిద్దనకొండూరులోని ఫారమ్‌పాండ్‌ను పరిశీలించారు. కలిగిరిలో ఉపాధిహామీ పథకం కూలీల ద్వారా తవ్విన ఫారంపాండ్‌ను సందర్శించారు. నాగసముద్రంలో హెల్త్ క్లీనిక్ భవనం నుంచి పడే వర్షపు నీటిని నిల్వ చేసే ఇంకుడుగుంతను తనిఖీ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేస్తున్న నిమ్మతోటలు, డ్రాగన్‌ఫ్రూట్స్ తోటలను పరిశీలించారు. ఉపాధిహామీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులు, అధికారులకు పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీనివాసరావు, ఏపీడీలు విజయలక్ష్మి, శివశంకర్, ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, ఈఓపీఆర్డీ మధు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ పనుల తనిఖీ

వరికుంటపాడు : వరికుంటపాడు మండలం రామాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా చేపట్టిన అమృత్ సరోవర్ ట్యాంక్ పనులను కేంద్ర జల్‌శక్తి జాయింట్ సెక్రటరీ సచిద్రకుమార్ బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీటిని ఒడిసి పట్టడమే జల్ జీవన్ మిషన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఎక్కువ నీటిని నిల్వ చేసి రైతులకు సద్వినియోగమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసులు, ప్రత్యేకాధికారులు లక్ష్మీనారాయణ, లోకేశ్, అడిషనల్ పీడీ విజయలక్ష్మి, ఎంపీడీఓ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిమలూరులో ‘నేడు బడికి పోతా’

ఆత్మకూరురూరల్ : మండలంలోని మహిమలూరు ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాలలో పిల్లలను చేర్చుకునేందుకు పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ‘నేడు బడికి పోతా’ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గిరిజనకాలనీలో పర్యటించి ఎనిమిది మంది చిన్నారులను బడిలో చేర్చుకునేలా తల్లిదండ్రులను ఒప్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఇస్మాయిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా విద్యాసంస్థల బంద్



సీతారామపురం : మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్‌కు నోటీసు ఇస్తున్న విద్యార్థి నేతలు



ఉదయగిరి పట్టణంలో..



ఆత్మకూరు పట్టణంలో..

సీతారామపురం : నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల పరిధిలో గురువారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పలు విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్షా పత్రాల లీకులకు కారణమైన నేషనల్ టెస్ట్ ఏజెన్సీని రద్దు చేయాలని, పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలను కలిసి నోటీసులు అందించి బంద్‌కు సహకరించాలని కోరారు.

ఉదయగిరిలో..

ఉదయగిరి : ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ డివిజన్ నాయకుడు వెంకటయ్య మాట్లాడుతూ మెడికల్ ప్రవేశాల పరీక్షను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులను నియమించాలని, ప్రైవేటు పాఠశాలల్లో మౌలిక వసతులు ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.వెంకటయ్య, శ్రీధర్‌రెడ్డి, నరేంద్ర, రజాక్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నిరసన

ఆత్మకూరు : ఎన్‌సీఏ ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని, వీటిపై కేంద్ర ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టాలని పలు విద్యార్థి సంఘాలు గురువారం నిరసన ధర్నాలు చేపట్టాయి. ఆత్మకూరు పట్టణంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ తదితర విద్యార్థి సంఘాల పిలుపు మేరకు పలు ప్రభుత్వ పాఠశాలల వద్ద విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఎన్‌సీఏ నిర్వహించిన నీట్, నెట్ పరీక్షల్లో పేపర్ లీకేజీ అయినా, ఆధారాలు ఉన్నా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోందన్నారు. వెంటనే ఎన్‌సీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ కార్యవర్గ సభ్యులు చక్రీ, అఖిల్, ఖాదర్‌బాషా, యస్దానీ తదితరులు పాల్గొన్నారు.